AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-14 | December 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/dec_2023/full_papers/december23_06.php

DOI:

# 6.‘సేవాసదన్’ నవల మూడు తెలుగు అనువాదాలు: తులనాత్మకపరిశీలన



**డా. చైతన్య ఎ.వి.వి.కె.**
స్వతంత్ర అనువాదకుడు,
గుంటూరు, ఆంధ్రప్రదేశ్.
సెల్: +91 9492376932. Email: avvk.chaitanya@gmail.com

**వ్యాససంగ్రహం:**

*“అనువాదం” అంటే స్థూలంగా ‘ఒక భాషలో ఉన్న విషయాన్ని వేరొక భాషలోకి మార్చడం’. అనువదించే అంశాన్ని బట్టి అనువాద విధానం మారుతుంది. ఇతర అనువాద విధానాలకంటే సాహిత్యానువాదానికి ఒక ప్రత్యేకత ఉంది. సాహిత్యానువాదం సృజనకు సంబంధించిన అంశం కూడా. సాహిత్యానువాదంలో ప్రక్రియకున్న ప్రాముఖ్యాన్ని గురించి, ప్రక్రియా లక్షణాలను అనువాదకుడు తెలుసుకోవలసిన అవసరం ఉంది. ఉదా: నవలానువాదకులకు నవలా ప్రక్రియ లక్షణాలు తెలియాలి. అపుడే ఆయా ప్రక్రియలకు సరిపోయే అనువాద నియమాలను తయారుచేసుకోవచ్చు. అరుదుగా ఒకే రచనను వేర్వేరు సమయాలలో ఇద్దరు, ముగ్గురు అనువదిస్తుంటారు. ఇటువంటి అనువాదాలను తులనాత్మకంగా పరిశీలించడం వల్ల ఆయా రచనల అనువాదంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలను ప్రయోగపూర్వకంగా తెలుసుకోవచ్చు. ప్రేమ్ చంద్ హిందీలో రాసిన “సేవాసదన్” నవలకు తెలుగులో మూడు అనువాదాలు కనిపిస్తున్నాయి. మూడు అనువాదాలను తులనాత్మక పద్ధతిలో, అనువాద విధానాలు, నవలా లక్షణాల సమన్వయంతో పరిశీలించవలసిన అవసరం ఉంది. తద్వారా హిందీ నుండి తెలుగులోకి నవలానువాదాలు చేయడానికి, తగిన సూచనలు చేయడం ప్రస్తుత పత్ర ప్రధానోద్దేశం.*

**Keywords:** సేవాసదన్, అనువాదం, నవల, ప్రేమ్‌చంద్, అనువాద విధానాలు.

## 1.ఉపోద్ఘాతం:

1900-1920 మధ్యకాలాన్ని తెలుగు నవలాసాహిత్యచరిత్రకారులు నవలకు సంబంధించి అనువాద యుగంగా చెబుతున్నారు. అటు తర్వాత కూడా తెలుగులో అనువాద నవలలు వస్తూనే ఉన్నాయి. అనువాద యుగాన్ని పరిశీలిస్తే బెంగాలీ, హిందీ వంటి భారతీయ భాషల నుండి ఇంగ్లీషు, రష్యా, ఫ్రెంచి, జపాను వంటి విదేశీ భాషల నుండి నవలలు తెలుగులోకి వచ్చాయి. తెలుగులోకి అనువాదం చేసిన నవలల్లో బెంగాలి, హిందీ

వంటి ఉత్తర భారతీయ భాషల్లోని నవలలే ఎక్కువ. హిందీ నుండి వచ్చిన నవలల్లో ప్రేమ్‌చంద్ నవలలు(సేవాసదన్, గోదాన్, రంగభూమి, నిర్మల... etc.), రాహుల్ సాంకృత్యాయన్ నవలలు (వోల్గా నుండి గంగ వరకు, దివోదాసు, సింహసేనాపతి) ముఖ్యమైనవి. **हिन्दी तथा तेलुगु प्रदेशों की जनता की चिन्तन-पद्धति, धारणाएँ आदी में समानताएँ स्पष्ट दीखती हैं। [హిందీ, తెలుగు ప్రాంతాలలో నివసించే ప్రజల ఆలోచనా పద్ధతి, భావనలు వంటి అంశాలలో సమానత్వం స్పష్టంగా కనిపిస్తుంది]**1.

కనుకనే తెలుగు, హిందీల మధ్య అనువాదాలు ఎక్కువగా కనిపిస్తాయి. హిందీ అనువాదాలు ఎక్కువగా చేస్తున్నది హిందీ నేర్చుకున్న తెలుగువారే కావడం గమనించవలసిన అంశం. ఒకే రచనను వేర్వేరు సమయాలలో ఇద్దరు, ముగ్గురు అనువదించిన సందర్భాలూ ఉన్నాయి. ఇటువంటి అనువాదాలను తులనాత్మకంగా పరిశీలించడం వల్ల ఆయా రచనల అనువాదంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలను ప్రయోగపూర్వకంగా తెలుసుకోవచ్చు.

ప్రస్తుత పత్రరచనకు ఎంచుకున్న “సేవాసదన్” నవలకు తెలుగులో మూడు అనువాదాలు కనిపిస్తున్నాయి. అవి:

1. సేవాసదన్- శేషగిరిరావు, పోలు (అనువాదకుడు). 2011.
2. సేవాసదనము- సోమయాజులు, యస్. యస్.వి. (అనువాకుడు). 1981.
3. సేవాశ్రమము- దామెర్ల భ్రమరాంబ, కొండ విజయలక్ష్మీబాయి (అనువాదకులు). 1949.

సేవాసదన్ నవలను ఉర్దూలో ప్రేమ్‌చంద్ 1916లో మొదట "బాజార్- ఎ- హుస్న్" పేరుతో రచించినా హిందీ ప్రతి ముందుగా ముద్రితం అయింది. “సేవాసదన్” పేరుతోనే పోలుశేషగిరిరావు తెలుగు చేశారు. ప్రేమ్‌చంద్ ఆధునిక హిందీ సాహిత్యంలో యుగకర్తగా పేరుగాంచినవాడు. తొలితరం హిందీ అభ్యుదయవాద రచయితలలో ఆయన ప్రముఖుడు. సమకాలీన సమాజం, అందులోని వ్యక్తులు, వారి అనుభవాలు, ఆశలు, ఆక్రోశాలు వంటి అంశాలనే ప్రేమ్‌చంద్ రచనా వస్తువుగా స్వీకరించారు. సేవాసదన్ నవల కూడా ప్రేమ్‌చంద్ కాలంనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత, సాంస్కృతిక పరమైన అంశాలను చర్చిస్తుంది. అంటే స్వాతంత్ర్యానికి పూర్వపు భారతీయ సమాజ స్వరూపాన్ని అందిస్తుంది.

## 1. సేవాసదన్:

సేవాసదన్ నవలలోని వస్తువు ప్రధానంగా స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న భారతీయస్త్రీజీవిత చిత్రణకు సంబంధించింది. స్త్రీవిద్య, స్త్రీహక్కులు అన్న భావాలు అప్పుడప్పుడే సమాజంలో ప్రవేశిస్తున్నాయి. అలాంటి కాలంలో కుటుంబ జీవితాన్ని ఎదిరించిన స్త్రీ ఎటువంటి కష్టనష్టాలను భరించవలసి ఉంటుందో ’సుమన్’ పాత్ర ద్వారా నవలలో చర్చించారు రచయిత. ప్రధాన వస్తువు స్త్రీ జీవిత చిత్రణే అయినా దానిని నిర్దేశించిన సామాజిక వస్తువు కూడా నవలలో కనిపిస్తుంది. ఇందులోని వస్తువు ప్రధానంగా మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి మహిళల జీవితాలకు సంబంధించినదిగా చెప్పవచ్చు. నవల నేపథ్యంలో చారిత్రక కాలం కనిపించినా, చారిత్రక అంశాలు వస్తువులో లేవు.

**1.1 ఇతివృత్తం:**

సేవాసదన్ నవల ఇతివృత్తం పాత్ర ప్రాధాన్యత (Plot of Character) కలిగినది. అంటే జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలు, అనుభవాల వల్ల ప్రధానపాత్ర వ్యక్తిత్వంలో మార్పు రావడం. అందులోనూ ప్రధానంగా Reform Plot అన్న వర్గానికి చెందుతుంది. అంటే ప్రధాన పాత్ర పతనావస్థకు చేరుకొని తన స్థానాన్ని తిరిగి పొందుతుంది. నవలలో సుమన్ పాత్ర కుటుంబ జీవితాన్ని చిన్నచూపు చూసి వేశ్యగా మారలనుకోవడం, తిరిగి గౌరవ ప్రదమైన జీవితాన్ని గడపడానికి ప్రయత్నించి విజయం సాధించడం కారణంగా Reform Plot ఇతివృత్తానికి "సేవాసదన్" నవల సరిపోతుంది. పాత్ర ప్రాధాన్యం గల ఇతివృత్తం కావడంవల్ల సుమన్ పాత్రలోని ఉత్థాన, పతనాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలు నవల ఇతివృత్తాన్ని నిర్దేశించాయి. కథనం విషయానికి వస్తే సేవాసదన్ నవల సర్వజ్ఞతా దృష్టికోణంలో కనిపిస్తుంది. తొలితరం భారతీయ నవలలన్నీ (ఉదా: కపాలకుండల, ప్రతాపముదలియారు చరిత్ర, ఇందులేఖ) ఇటువంటి దృష్టికోణంలోనే నడిచాయి. సర్వజ్ఞతా దృష్టికోణంలో రచయితే కథకుడు. పాత్రలు, వాతావరణం, సంభాషణలు అన్నింటినీ రచయిత నియంత్రిస్తాడు. నవల మధ్యలో ఎక్కడైనా సరే రచయిత ప్రవేశించి వివరణలు, వ్యాఖ్యానాలు చేస్తాడు. "**సందర్భాన్ని బట్టి అన్ని పాత్రల మనస్సులలోకి ప్రవేశించి, వారి చర్యలను, ప్రతి చర్యలను వ్యక్తం చేస్తూ వుంటాడు**"2. దీనిని బట్టి నవలలోని పాత్రలన్నీ రచయిత చేతిలోని కీలుబమ్మలు. ఒక విధంగా రచయిత దేవుడి పాత్రను పోషిస్తాడు.

**1.2 పాత్రచిత్రణ:**

సేవాసదన్ నవలలో అన్ని పాత్రలను సంక్లిష్టతగల పాత్రలుగానే చెప్పాలి. ఏదో ఒక భావానికి లేదా అభిప్రాయానికి ప్రతినిధులుగా కనిపించే పాత్రలు సందర్భాలకు అనుగుణంగా మారిపోవడం కనిపిస్తుంది. వాస్తవ సమాజంలో మనుషులు ప్రవర్తించే తీరును నవలలోని పాత్రలు ప్రతిబింబిస్తాయి. నవలలో అంతగా ప్రాధాన్యం లేని చిన్న పాత్రలు కూడా ఇదే తీరును ప్రదర్శించడం నవలలోని విశేషం. ఉదా: సుమన్ పిన్ని అయిన జాహ్నవి పాత్రను పరిశీలిస్తే-

"**జాహ్నవి హృదయం కూడా జాలితో నిండిపోయింది. తల్లిదండ్రులు లేని యీ బిడ్డను ఎన్నో కష్టాలు పెట్టాము. ఆ విషయం తలచుకొని ఆమె దుఖాన్ని ఆపుకోలేకపోయింది**"3.

సుమన్ తల్లిని, చెల్లి అయిన శాంతను అనేక బాధలు పెట్టిన ఈ పాత్ర, శాంత అత్తవారింటికి వెళుతోంటే బాధపడడం సంక్లిష్ట పాత్రచిత్రణకు మంచి ఉదాహరణ.

**1.3 శైలి:**

ప్రేమ్‌చంద్ భాష సరళమైనదే కానీ అది ప్రజలు సాధారణంగా మాట్లాడుకొనే వ్యావహారిక భాష కాదు. తెలుగులో ఒకప్పుడు సరళ గ్రాంథిక భాష ఎలా ఉండేదో అటువంటి భాషను ప్రేమ్‌చంద్ తన రచనలలో వాడారు. ప్రేమ్‌చంద్ భాష సరళ గ్రాంథికానికి, వ్యావహారిక భాషకూ మధ్యస్థంగా కనిపిస్తుంది. పదాలలో

ఎక్కువగా సంస్కృత తత్సమ శబ్దాలు వాడినా, వాక్య నిర్మాణంలో, జాతీయాలు, సామెతలు వాడి వ్యావహారిక భాషకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఈయన రచనలలో ఒక కొత్త సాహిత్య శైలి కనిపిస్తుంది.

ఉదా: **"गंगाजलि पुराने विचार के अनुसार लडकियों के ऋण से शीघ्र ही मुक्त होना चाहती थी। पर दारोगाजी कहते, यह अभी विवाह योग्य नहीं है। शास्त्रो में लिखा है कन्या का विवाह सोलह वर्ष की आयु से पहले करना पाप है।**"4.

శేషగిరిరావు తెలుగు అనువాదంలో ప్రేమ్‌చంద్ శైలిని అనుకరించడానికి ప్రయత్నించారు. వీరి అనువాదంలో కూడా తత్సమ పదాలు, వ్యావహారిక వాక్య నిర్మాణం కనిపిస్తాయి. పై హిందీ వాక్యాలకు తెలుగు అనువాదాన్ని పరిశీలిస్తే-

**"గంగాజలి సనాతన సంప్రదాయం ప్రకారం ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసి విముక్తి పొందాలని అనుకుంటుంది. కానీ సబ్‌ఇన్‌స్పెక్టరు అంటూ వుండేవాడు వీళ్ళకు ఇంకా పెళ్ళియీడు రాలేదు. కన్యకు పదహారేళ్ళ వయసు రాకముందే పెళ్ళి చేయడం పాపం అని శాస్త్రాలలో వ్రాసి వుందనే వాడు**"5.

పై అనువాదంలో సనాతన సంప్రదాయం, వివాహం, విముక్తి, కన్య వంటి పదాలు మూలాన్ని అనుసరించి వాడినవే. కనుక పదానువాదం చేశారని చెప్పవచ్చు. పదాదిలో 'ర'కారం చేర్చి (వ్రాత) రాయడం, గ్రాంథిక రూపానికి ఉదాహరణలుగా కనిపిస్తే, క్రియలు (అనుకుంటుంది, వుందనేవాడు) వ్యావహారికానికి ఉదాహరణలుగా కనిపిస్తాయి.

ప్రేమ్‌చంద్ తన నవలల్లో పాత్రోచితమైన శైలికి ప్రాధాన్యం ఇస్తారు. సేవాసదన్ నవలలోని పాత్రలన్నీ చాలా వరకూ ఎగువ మధ్యతరగతికి చెందినవి. ఒక్క జీతన్ పనివాడు కనుక నిరక్షరాస్యుల మాండలికం వాడారు.

ఉదా: **"भय्या बहूजी ने जो गजाधर की दुलहिन को घर ठहरा लिया है, इस पर बाजार में बडी बदनामी हो रही है। एसा मालूम होता है कि यह गजाधर से लडकर आई है।**6. అనువాదంలో శేషగిరిరావు ఏ విధమైన మాండలికాన్ని వాడలేదు. ఇతర పాత్రలకు వాడిన భాషనే జీతన్ మాటల శైలికి కూడా వాడారు.

ఉదా: "**అయ్యగారూ! గజాధర్ భార్యకు అమ్మగారు ఇంట్లో ఆశ్రయం ఇచ్చింది. దీన్ని గురించి బజారులో వాళ్ళంతా అవమానకరంగా మాట్లాడుకొంటున్నారు. ఈమె గజాధర్‌తో పోట్లాడి వచ్చినట్లుంది**"7.

ప్రేమ్‌చంద్ శైలిలో కనిపించే మరొక లక్షణం Ellipsis అంటే అర్థాంతర ముగింపు. వాక్యాన్ని అసంపూర్ణంగా ముగించినా అక్కడి సన్నివేశం, ముందు జరిగిన కథ, పాత్ర వ్యక్తిత్వం మిగిలిన వాక్యాన్ని పాఠకుడు అవగాహన చేసుకొనేలా చేస్తాయి. సేవాసదన్‌లో సుమన్ పార్కులో పద్మసింహను కలుసుకొనే చోట ఈ అర్థాంతర ముగింపు కనిపిస్తుంది.

ఉదా: "**ఆ దోషం మీకెందుకు అంటగట్టాలి? ఇదంతా నా అపరాధమే. నేను... సుమన్ ఇంకా యేదో చెప్పబోతూ వుంది. ఈ కథంతా గంభీర భావంతో వింటున్న పద్మగారు ఆమె మాటను ఆపి ఇలా అన్నాడు**"8.

ఇక్కడ సుమన్ కథ ఎదుటి పాత్రకు కొంత తెలుసు, పాఠకుడికి మొత్తంగా తెలుసు, అందువల్ల పునరుక్తి కాకుండా మధ్యలోనే ఆమె సంభాషణను ఆపారు.

### 1.4 జాతీయాల, సామెతల అనువాదం:

జాతీయాల అనువాదంలో చాలా వరకు భావానువాదమే కనిపిస్తుంది. మట్టి సుద్ద అన్న జాతీయం మూలంలోని జాతీయాన్ని అనుసరించి అనువదించారు. सिक्का चलना జాతీయానికి చక్రంతిప్పడం, మాటచెల్లడం వంటి జాతీయాలను సమానార్థకాలుగా చెప్పవచ్చు. हाथ मारना జాతీయానికి 'చేతివాటం చూపడం' అన్న జాతీయాన్ని, बाजी पलट देना జాతీయానికి 'ఎత్తుకు పై ఎత్తు' జాతీయాన్ని సమానార్థకాలుగా చెప్పవచ్చు. दाल न गलना జాతీయానికి 'పప్పులు ఉడకకపోవడం' అనే తెలుగు జాతీయం అర్థంతోపాటు, రూపంలో కూడా సారూప్యత కలిగి ఉంది. కళ్ళెంలేని గుర్రం, ముఖం కడుక్కుని ఉండడం జాతీయాల అనువాదంలో పదానువాదాన్ని అనుసరించారు. సామెతల అనువాదంలో మాత్రం పదానువాదం ఎక్కువగా కనిపిస్తుంది. అయితే హిందీ సామెతకు సమానార్థకంగానే గాక రూపంలో కూడా పోలికలుగల సామెతలను అనువదించారు. రెండు భాషల మధ్య సంస్కృతుల మధ్య ఉన్న దగ్గరి సంబంధం కారణంగా ఈ పోలికలు ఏర్పడ్డాయి. **बकरा जी से गया, खाने वाले को स्वाद ही न मिला** అన్న సామెతకు **'వ్రతం చెడింది, ఫలం దక్కలేదు'** అన్న సామెతను, **जखम पर नमक छिडकना** సామెతకు 'పుండు మీద కారం చల్లడం' సామెతను, **चोरी करके सीनाजोरी** సామెతకు **'కింద పడినా పై చేయి నాదేననడం'** అన్న సామెతను సమానార్థాకాలుగా చెప్పుకోవచ్చు.

### 1.5 వాతావరణం:

సేవాసదన్ నవల కల్పనాత్మక రచన అయినా నవలలో కనిపించే సమాజం లేదా వాతావరణం చారిత్రకమైనదనే చెప్పాలి. ప్రేమ్‌చంద్ నవలను రచించే నాటికి ఇది సమకాలీన వాతావరణమే. స్వాతంత్ర్యానికి పూర్వం భారతీయ సమాజాన్ని, అందులో స్త్రీల దుస్థితిని నవల ఎక్కువగా వర్ణించింది. నాటి సమాజంలోని సాంఘిక దురాచారాలు (బాల్య వివాహాలు, బహుభార్యత్వం, సతీసహగమనం, అంటరానితనం), సమాజంలో ఆంగ్ల విద్యావ్యాప్తి ఫలితంగా వస్తున్న మార్పులు, అభివృద్ధి ఫలాలను తమ స్వార్థానికి వాడుకునే స్వార్థపరులైన సంస్కర్తలు, వేశ్యావ్యవస్థ, మేజువాణీలు, వరకట్న దురాచారం, మతకలహాలు వంటి సాంఘిక సమస్యలను చిత్రించినా నవల ప్రధానంగా వేశ్యావ్యవస్థ చిత్రణకు, ఆ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చింది.

వేశ్యావ్యవస్థ నిర్మూలన గురించిన చర్చను చాలా రచనలే చేశాయి. (తెలుగులో కన్యాశుల్కం) కానీ, ఒక స్త్రీ వేశ్యావృత్తిని ఎంచుకోవడానికి దారితీసిన సామాజిక, ఆర్థిక, మానసిక కారణాలను సేవాసదన్ నవల చిత్రించింది. సుమన్ పాత్ర వేశ్యగా మారడానికి తండ్రి గారాబంగా పెంచడం, భర్త ఆర్థిక పరిస్థితి, వయసులో అతనికీ, తనకు ఉన్న తేడా ఒక కారణమైతే, పద్మసింహ వంటి పేరుప్రతిష్టలుగల వ్యక్తులు వేశ్యలను ఆదరించడం, గుళ్లలో, ఉత్సవాలలో భోలీబాయి వంటి వేశ్యలకు ఆదరణ లభించడం రెండవ కారణం. ఈ కారణాన్ని సుమన్ పాత్ర ద్వారానే రచయిత చెప్పించారు.

ఉదా: "**నాకు(సుమన్‌కు) గౌరవ మర్యాదలు లభించే మార్గం కనిపించింది. నేను ఆ ఉత్సవానికి రాకుండా ఉన్నట్లయితే ఈనాడు నేను నా గుడిసెలో సంతృప్తిగా పడి ఉండేదాన్ని. నేను మిమ్మల్ని సౌసీల్యంగల వారుగా భావిస్తూ ఉండేదాన్ని. అంచేత మీ రసికత నన్ను మరింతగా ప్రభావితం చేసింది. భోలీబాయి మీ సమక్షంలో గర్వంగా కూర్చుని ఉంది.**"9.

సమాజంలో గౌరవం, మర్యాద ఉన్న వ్యక్తులే భోలీబాయి వంటి వేశ్యలకు గౌరవం ఇస్తున్నపుడు ఆ గౌరవాన్ని పొందటానికి తను వేశ్యగా మారడంలో తప్పేమిటన్నది సుమన్ ప్రశ్న. నేపథ్యాన్ని కేవలం సమాజానికే పరిమితం చేయకుండా ఆనాటి హిందీ సాహిత్యం పొందుతున్న మార్పులను కూడా నవలలో నిశితంగా విమర్శించారు.

ఉదా: "**అనువాదాలను మినహాయిస్తే నవీన హిందీ సాహిత్యంలో హరిశ్చంద్రుని రెండు మూడు నాటకాలు, చంద్రకాంతా సంతతి తప్ప మరేమీ ఉన్నట్లు కనిపించదు.......... అనువాదాలతో హిందీకి అపకారం జరుగుతుందని నాకు అభిప్రాయం యేర్పడుతూ వుంది. మౌలికత్వం పొందడానికి అవకాశం లభించదు**"10. ఆనాటి సాహిత్యం గురించే కాదు దేశం మొత్తానికి ఒకటే భాష ఉండవలసిన అవసరం గురించి కూడా ప్రేమ్‌చంద్ మూలంలో వివరించారు. అనువాదంలో వీటిని తొలగించారు.

**1.6 కాలం:**

ప్రేమ్‌చంద్ తన సమకాలీన సమాజాన్ని చిత్రించినా ఈనాటికి, అది చారిత్రక కాలమే అవుతుంది. సేవాసదన్ రచన నాటికి స్వాతంత్రోద్యమం ముమ్మరంగా సాగుతున్నా, ఆ అంశాలేవీ నవలలో కనిపించవు. కేవలం సాంఘిక దురాచారాల మీదే రచయిత దృష్టి నిలిపారు. ప్రేమ్‌చంద్ నవల రాసే నాటికే గాంధీ ప్రభావానికి లోనై ఉన్నారు. కనుకనే సేవా ధర్మాన్ని ఉత్తమమైన ధర్మంగా చిత్రించారు.

"**కలియుగంలో ముక్తి లభించడానికి ఒకటే మార్గం ఉంది. అదే సేవామార్గం. ఈ మార్గంలో వెళ్ళు. నీవు ఉద్ధరించబడతావు**"11.

కాలంలో రెండు ముఖ్యమైన అంశాలు త్వరితగతి (Acceleration), మందగతి (Deceleration). త్వరితగతిలో కాలం లేదా అంశం వేగంగా ముందుకు వెళుతుంది, మందగతిలో నెమ్మదిగా నడుస్తుంది. సేవాసదన్ నవలలో రెండు లక్షణాలూ కనిపిస్తాయి. త్వరితగతికి ఉదాహరణ: కాలం పరంగా చూస్తే సుమన్ హోలీ పండుగకు సుభద్ర ఇంటికి వెళ్ళిన సమయంలో గజాధర్ ఆమెకోసం ఇంటిదగ్గర ఎదురుచూస్తూ ఉంటాడు. ఆ సమయంలో రచయిత సమయాన్ని గురించి చేసిన చర్చ చూస్తే గజాధర్ పదకొండు గంటలకు నిద్రపోయాడు. తరువాతి వాక్యంలో సుమన్ ఒంటిగంటకు ఇంటికి వచ్చింది. రెండువాక్యాల మధ్య కాలాన్ని త్వరితగతిలో రచయిత నడిపించారు. మందగతి సదన్ బంగారు గాజులు దొంగిలించిన సందర్భంలో కనిపిస్తుంది. సదన్ గాజులు దొంగిలించింది ఉదయం పూట, సాయంత్రం సుభద్ర గాజుల కోసం వెతికే వరకూ మధ్యలో దాదాపు ఇరవై పేజీల కథను నడిపారు రచయిత. ఇక Frequency లేదా పునర్‌కథనం విషయానికి వస్తే సేవాసదన్ నవలలో పునరుక్తమైన విషయాలు వేశ్యా వ్యవస్థ గురించి, సమాజసేవ గురించి. నవలా కాలం

వాతావరణం, సంభాషణల్లో భాగంగా కొనసాగింది. అది కూడా స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న భారతదేశ కాలాన్ని సూచిస్తుంది.

### 1.7 సంస్కృతి:

సేవాసదన్ నవలలో కనిపించే సంస్కృతి ప్రధానంగా భారతీయ హిందూ సమాజానికి చెందినది. వివాహం, కుటుంబం అన్న అంశాలకు భారత సంస్కృతిలో ఎంతో విలువ ఉంది. ప్రేమ్‌చంద్‌కు కూడా వీటి పట్ల గౌరవ భావం ఉన్నట్లు కనిపిస్తుంది. కారణం ప్రేమ్‌చంద్ ఇతర రచనలైన గోదాన్, నిర్మల, కర్మభూమిలలో వివాహ బంధానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. వివాహ వ్యవస్థలోని దురాచారాలను చిత్రించడం కూడా చేశారు. పెళ్ళి సమయంలో చేసే ఆర్భాటాలు, ఆచారాలు, హిందూ, ముస్లిముల పండుగలు వంటివి రచయిత నవలలో చిత్రించారు. నవలా కాలం ఒక ఆధునిక మార్పులను పొందుతున్న కాలం. అందువల్ల పాత, కొత్త అన్న రెండు పార్శ్వాలు నవల సంస్కృతిలో కనిపిస్తాయి. పెళ్ళికి భోగంమేళం కావాలని, అది సంప్రదాయమని పట్టుబట్టిన ప్రజలకు, సంప్రదాయాలకు, మతానికి ప్రతీక అయిన సాధువు ద్వారా బుద్ధి చెప్పించారు. సంస్కృతి, సంప్రదాయాల పేరుతో సంఘంలో ఉన్న మంచి, చెడులు రెంటినీ చిత్రించారు.

### 1.8 ప్రయోజనం:

“సేవాసదన్” నవల ప్రయోజనం సమాజంలోని వేశ్యావ్యవస్థ చిత్రణ. ’నవల’ అన్న సాహిత్య ప్రక్రియను ఎంచుకోవడం ద్వారా ప్రేమ్‌చంద్ ఎంచుకున్న వస్తువును సమగ్రంగా చిత్రించగలిగారు. వేశ్యావ్యవస్థకు కారణమైన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను విశ్లేషించారు. వేశ్యావ్యవస్థను నిర్మూలించడంలో విఫలమైన కుహనా సంస్కర్తలను, రాజకీయ కారణాలను నవలలో వివరించారు. నవల కేవలం ఒక్క సమస్యా చిత్రణకే ప్రాధాన్యం ఇవ్వలేదు. సమస్య పరిష్కారానికి మార్గాన్ని కూడా పరోక్షంగా అందిస్తుంది. ప్రేమ్‌చంద్ పరిష్కారాన్ని కూడా వాస్తవికంగానే చిత్రించారు. వేశ్యల కూతుళ్లను సేవాసదనంలో చేర్చడం ద్వారా వారు తిరిగి సభ్య సమాజంలో భాగం అయి వివాహం చేసుకోవచ్చని చెబుతూనే, ’సమాజం అటువంటి పెళ్ళిళ్ళకు ఎంతవరకు తయారుగా ఉంది?’ అనే విషయాన్ని సమాజానికే వదిలేసారు.

### 2. సేవాసదనము:

ప్రేమ్‌చంద్ హిందీలో రచించిన సేవాసదన్ నవలను “సేవాసదనము” పేరుతో యస్. యస్. వి. సోమయాజులు 1981లో అనువదించారు. వస్తువు, ఇతివృత్తం, పాత్రచిత్రణ, వాతావరణం అన్న లక్షణాలలో “సేవాసదనము” మూలాన్నే అనుసరించింది. ఈ అంశాలలో శేషగిరిరావు అనువాదం సేవాసదన్‌కు, ప్రస్తుత అనువాదానికీ తేడాలేవీ కనిపించవు. అయితే శైలి విషయంలో రెండు అనువాదాలకు చాలా తేడాలున్నాయి. శేషగిరిరావు అనువాదంలో శైలి కొంత గ్రాంథిక, కొంత వ్యావహారిక శైలుల మిశ్రమంగా కనిపిస్తే, “సేవాసదనము”ను సోమయాజులు పూర్తిగా సరళ గ్రాంథిక శైలిలో అనువదించారు.

ఉదా: **"गंगाजलि पुराने विचार के अनुसार लडकियों के ऋण से शीघ्र ही मुक्त होना चाहती थी। पर दारोगाजी कहते, यह अभी विवाह योग्य नहीं है। शास्त्रो में लिखा है कन्या का विवाह सोलह वर्ष की आयु से पहलॆ करना पाप है।**"12.

ఈ వాక్యాలను శేషగిరిరావు అనువదించిన తీరును ముందు విభాగంలో పరిశీలించడమైనది. కేవలం పదస్థాయిలోనే శేషగిరిరావు గ్రాంథిక శైలిని వాడారు. సొమయాజులు అనువాదాన్ని పరిశీలిస్తే-

**"గంగాజలి పూర్వాచారము ననుసరించి శీఘ్రముగ పిల్ల వివాహ మొనరించి ఋణవిముక్త కాఁగోరును. కాని యిన్స్పెక్టరుగారు ఇప్పుడేమి పెండ్లి? పదునారు సంవత్సరములు నిండనిదే ఆఁడుపిల్లకు పెండ్లిచేయుట పాపము అందురు**"13.

ఒక్క 'విముక్త' అన్న పదం తప్ప మిగిలిన పదాలన్నీ అనువాదకుడు స్వతంత్రంగా వాడినవే. ఆడపిల్ల, పెళ్ళి, పదహారు వంటి తెలుగు పదాలను కూడా గ్రాంథిక శైలిలో రాశారు. నవల అనువాద కాలానికి సరళ గ్రాంథిక భాష సృజన సాహిత్యంలో కొంత కొనసాగుతూనే ఉంది. అనువాద నవలల్లో అప్పటికే వ్యావహారిక భాష బాగా వ్యాప్తిలో ఉంది. నండూరి రామ్మోహనరావు, క్రొవ్విడి లింగరాజు, తెన్నేటి సూరివంటి అనువాదకులు తమ అనువాదాలలో వ్యావహారిక భాషనే అనుసరించారు. సామాన్య పాఠకులకు సొమయాజులు గ్రాంథిక శైలి అర్థం కావడం కష్టమే. వ్యావహారిక భాషలో ఉన్న శేషగిరిరావు అనువాదమే నేడు పునర్ముద్రణ పొంది పాఠకులకు అందుబాటులో ఉంది. మూలంలో ప్రేమ్‌చంద్ పాత్రోచిత సంభాషణలకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. చదువులేని పని వాడైన జీతన్ పాత్ర మూలంలో మాండలికంలో మాట్లాడితే, సోమయాజులు అనువాదంలో గ్రాంథిక భాష మాట్లాడుతుంది.

ఉదా: **"भय्या बहूजी ने जो गजाधर की दुलहिन को घर ठहरा लिया है, इस पर बाजार में बडी बदनामी हो रही है। एसा मालूम होता है कि यह गजाधर से लडकर आई है।**"14.

సోమయాజులు అనువాదం-

**"బాబూ! అమ్మగారు గజాధరుని భార్యగారిని ఇంటిలో నుంచినారు. దీనివలన పట్టణమున నప్రతిష్టపాలగుచున్నాము. ఈమె గజాధరునితో పోట్లాడి వచ్చినట్లున్నది**"15.

శేషగిరిరావు మాదిరే సోమయాజులు కూడా మూలంలోని చాలా అంశాలను అనువాదంలో తొలగించారు. ఉదా: తన ఇంటి నుండి వెళ్ళిపోయిన సుమన్ ఏమైపోయిందోనని ఆందోళన పడుతున్న పద్మసింహకు బజారులో లతీఫ్, అబుల్ వఫా కనిపిస్తారు. సుమన్ భోలీబాయిగా మారి వేశ్యావాటికలో ఉందని చెప్పి ఆమెకు, తమని పరిచయం చేయమని పద్మసింహను బలవంతపెడతారు. రానంటున్నా వినకుండా పద్మసింహను బండిలో ఎక్కిస్తారు. పద్మసింహ వేగంగా వెళుతున్న బండినుండి కిందకు దూకుతాడు. దీనితో అబుల్ వఫా, లతీఫ్‌లు ఆయనకు క్షమాపణ చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోతారు. ఈ సన్నివేశంలో పద్మసింహ సుమన్ దగ్గరకు రాకపోవడానికి కారణం, సుమన్ భోగపు స్త్రీలా మారడంలో తన తప్పు కూడా ఉంది అన్న బాధ. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సన్నివేశాన్ని అనువాదంలో తొలిగించారు. మొత్తం భావాన్ని ఒక్క వాక్యంతో సరిపెట్టారు. విఠల్‌దాసుకు, పద్మసింహ రాసిన ఉత్తరం కూడా అనువాదంలో తొలగింపు గురైంది. సదన్ గాజులు

దొంగిలించిన సందర్భంలో పద్మసింహ, సుభద్రల మధ్య జరిగిన సంభాషణ, సేవాసదన్‌లో వేశ్యలకు పుట్టిన ఆడపిల్లలు చదువు నేర్చుకోవడం, గొప్పింటి స్త్రీలు వాళ్ళకు చదవు చెప్తుండడం వంటి సన్నివేశాలను తొలగించారు. మూలంలో ఉన్న భోలీబాయి పాటను ఇద్దరు అనువాదకులు తొలగించారు. దీనివల్ల అనువాదానికి పెద్దగా నష్టం లేదనే చెప్పాలి. వేశ్యావృత్తిలోని హైన్యతను గురించి వేశ్యలంతా చర్చించుకునే సన్నివేశాలను కూడా సోమయాజులు తొలగించారు. నవలలోని ప్రధానాంశమే వేశ్యావ్యవస్థ నిర్మూలనకు సంబంధించింది. మూలంలో ప్రేమ్‌చంద్ రెండు, మూడు అధ్యాయాలను కేవలం వేశ్యావ్యవస్థ మీద చర్చలకే కేటాయించారు.

నాటి సమాజం ఇటువంటి దురాచార వ్యవస్థమీద ఎటువంటి అభిప్రాయం కలిగి ఉందో చెప్పడమే కాకుండా, స్వయంగా ప్రేమ్‌చంద్ తన అభిప్రాయాలను చెప్పారు. అదే సమయంలో వేశ్యల దృష్టికోణాన్ని సుమన్ అంతరంగ సంభాషణలలో, వేశ్యావాటికను, పట్టణాన్ని వదిలి వెళ్ళడానికి నిర్ణయించుకున్న వేశ్యల సంభాషణలలో చిత్రించారు. వేశ్యల మధ్య జరిగే చర్చతో సమస్యను అన్ని కోణాలవైపు నుండి ప్రేమ్‌చంద్ చిత్రించారు. వేశ్యల సంభాషణలను తొలగించడం వల్ల మూలం అందించే స్థాయిలో అనువాదంలో సమస్య చిత్రణ జరగలేదు. కనుక నవల ప్రయోజనమే దెబ్బతినే అవకాశం ఉంది. మొత్తంమీద శైలిని, తొలగింపులను మినహాయిస్తే శేషగిరిరావు, సోమయాజులు అనువాదాలు ఒకే విధంగా కనిపిస్తాయి.

### 3. సేవాశ్రమము:

ప్రేమ్‌చంద్ రచించిన సేవాసదన్ నవలను దామెర్ల భ్రమరాంబ, కొండ విజయలక్ష్మీబాయి 1932లో "సేవాశ్రమము" పేరుతో అనువదించారు. 1949ల అనువాద నవల పునర్ముద్రణ పొందింది. వస్తువు, ఇతివృత్తం, పాత్రచిత్రణ, కాలం అన్న అంశాలలో మూలాన్నే అనుసరిస్తుంది. నేపథ్య చిత్రణలో మాత్రం అనువాదకులు కొంత మార్పులు చేశారు. నవలలోని వాతావరణం లక్ష్యభాషా పాఠకులకు సహజంగా అనిపించడానికి మూల నవలలోని పాత్రలు, స్థలాల పేర్లను తెలుగు సమాజానికి తగ్గట్టుగా మార్చారు. వారు చేసిన మార్పులను పరిశీలిస్తే-

| S. No. | సేవాసదన్ మూలంలోని పేరు | | సేవాశ్రమము అనువాదంలోని పేరు |
|---|---|---|---|
| 1. | కృష్ణచంద్ర | - | కపిల నరసింహారావు |
| 2. | గంగాజలి | - | జగదాంబ |
| 3. | సుమన్ | - | కమల |

నవలలో వ్యక్తులు, స్థలాల పేర్లతోపాటు పండగల పేర్లను కూడా మార్చారు. మూలంలో హోలీ ఉత్సవం గురించిన ప్రస్తావన రెండు సార్లు ఉంది. దానిని అనువాదంలో సంవత్సరాదిగా మార్చారు. హోలీ పండుగ తెలుగువారు అంత భారీగా జరుపుకోరు. అందువల్ల తెలుగువారి ప్రధానమైన పండుగ ఉగాదిని చేర్చారు. మూలంలో సుమన్‌కు పదహారు సంవత్సరాల వయసు వచ్చేవరకు, కృష్ణచంద్ర ఆమె పెళ్ళిని గురించి ఆలోచించడు. అనువాదంలో ఈ వయసును పదమూడేళ్ళకు కుదించారు. మూలంలో కూతురుకు వెంటనే పెళ్ళి

చేయకపోవడానికి కారణంగా కృష్ణచంద్ర తాను బాల్యవివాహాలకు వ్యతిరేకమని వ్యాఖ్యానిస్తూ యుక్త వయసు వచ్చే వరకు కూతురికి పెళ్ళి చేయకూడదంటాడు.

**""गंगाजलि पुराने विचार के अनुसार लडकियों के ऋण से शीघ्र ही मुक्त होना चाहती थी। पर दारोगाजी कहते, यह अभी विवाह योग्य नहीं है। शास्त्रो में लिखा है कन्या का विवाह सोलह वर्ष की आयु से पहले करना पाप है।**"16.

మూలంలో పదహారు సంవత్సరాలు అని ఉంది. అనువాదంలో సుమన్ వయసును తగ్గించడం వల్ల సుమన్/కమలకు ముప్పై యేళ్ళ గజాధర్/రామప్రసాదశర్మతో బాల్య వివాహమే జరిగినట్టు తెలుగు పాఠకుడికి అనిపిస్తుంది. వయసును తగ్గించడంలో ఆనాటి సమాజంలోని కొన్ని దురాచారాలు కనిపిస్తాయి. ఆడపిల్లకు పన్నెండు, పదమూడు సంవత్సరాలు దాటకముందే పెళ్ళి చేయాలనే ఆచారం, ఆనాటి తెలుగు రచనలలో కూడా కనిపిస్తుంది. సమకాలీన తెలుగు నేపథ్యానికి సరిపోయేలా నవలలోని నేపథ్యాన్ని అనువాదకులు మార్చారు. ఇందువల్ల మూలభాషా నవల పాఠకుడికి అందించే అనుభూతి, లక్ష్యభాషా కలగడంలో ఏ విధమైన అడ్డంకి ఏర్పడదు. కారణం ప్రేమ్‌చంద్ మూలంలో చిత్రించిన సామాజిక నేపథ్యం చాలా వరకు సమకాలీన తెలుగు సమాజంలోనూ కనిపిస్తుంది. కన్యాశుల్కం, సేవాసదన్‌ల మధ్య కొంత సారూప్యత కనిపిస్తుంది. ఇద్దరు రచయితలు వేశ్యలు వేశ్యావృత్తి మానుకొని ఇతర వృత్తులు ఏవైనా చేసుకొంటూ సమాజంలో గౌరవంగా బతకవచ్చని చెబుతారు. "సేవాసదన్"లో చెప్పిన వరకట్నం, కుహనా సంఘసంస్కర్తలు, ఇంగ్లీషు విద్యాధికులు, మతపరమైన సంఘర్షణలు వంటి అంశాలన్నీ కన్యాశుల్కంలోనూ కనిపిస్తాయి. నేపథ్యంలోనే కాదు, శైలిలో కూడా ఆనాటి తెలుగు రచనా శైలి కనిపిస్తుంది. వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి నవలాకారులు తమ నవలల్లో వాడిన సరళ గ్రాంథిక శైలిని అనుసరించి 'సేవాశ్రమము' నవలలో శైలి కనిపిస్తుంది. సోమయాజులు అనువాదంతో పోల్చి చూస్తే భ్రమరాంబ, విజయలక్ష్మీబాయి అనువాదంలోని శైలి సరళంగానే కనిపిస్తుంది.

ఉదా: "**నరసింహారా విప్పుడు అనేక స్థలముల నుండి వరుల విషయమై సమాచారములు తెప్పించసాగెను. నాగరిక కుటుంబములతో సంబంధము చేయవలెనని ఆతని కెంతో యభిలాష**"17.

మూలంలో జీతన్ భాషలో కనిపించే మాండలిక ఛాయలు లేకుండా ఒకసారి, మాండలికంగా మరొకసారి అనువదించారు. మొదటి సందర్భం వెంకటస్వామి, కృష్ణశర్మల మధ్య సంభాషణ. ఉదా: జీతన్/వెంకటస్వామి సంభాషణలను గ్రాంథికశైలిలోనే అనువదించారు.

ఉదా:""**भय्या बहूजी ने जो गजाधर की दुलहिन को घर ठहरा लिया है, इस पर बाजार में बडी बदनामी हो रही है। एसा मालूम होता है कि यह गजाधर से लडकर आई है।**"18.

అనువాదాన్ని పరిశీలిస్తే-

"**బాబూ! రామప్రసాదంగారి భార్యను మనయింటి యందమ్మగారుండనిచ్చుట వలన బజారులో నెక్కడ జూచినా మీ మీద చెడ్డవాడుకగా నున్నది. ఆమె తన మగనితో తగవులాడి మన యింటికి లేచివచ్చినట్లుందరూ అనుకొనుచున్నారు**"19.

ఇలా మాండలికాన్ని, ప్రమాణమాండలికంలోకి అనువదించడాన్ని “**Neutralization**”20 అంటారు. రెండవ సందర్భం తన బంగారు గొలుసును అమ్మాలనుకున్న మోహనరావు/ సదన్‌కు వెంకటస్వామి/ జీతన్‌కు మధ్య జరిగిన సంభాషణ.

ఉదా: **"దీనికేనా బాబు ఇంతిశారిస్తున్నారు? నీ వొంటి గొప్పోరు సరుకులెందు కమ్ముకోవడం? అమ్మగోరి నడగండి. అమ్మగోరు ఎప్పుడూ లేదనరు. కానీ పంతులుగోరు నడుగుతే లాభం లేదు**"21.

ఇక్కడ వెంకటస్వామి సంభాషణలో కనిపిస్తున్న మాండలికం, కళింగాంధ్ర మాండలికానికి ఉదాహరణగా కనిపిస్తుంది. అయితే పూర్తిగా మాండలికాన్ని వాడలేదు. సరుకులు, పదాది అకారానికి బదులు ఒకారం వాడడంలో మాత్రమే మాండలికాన్ని వాడారు. కళింగాంధ్ర మాండలికంలోని పదాది ’ల’కారానికి ’న’కారం వాడడం, సంయుక్తాక్షరాలను ద్విత్వాక్షరాలుగా మార్చి పలకడం వంటి లక్షణాలు నవలలో లేవు. ఇలా పదాలకే మాత్రమే పరిమితమైన మాండలిక అనువాదాన్ని “**Lexicalization**” అంటారు.

మొత్తంమీద సేవాశ్రమము నవల అనువాదానికి మూలంలోని వాక్యాన్నే అనువాదప్రమాణంగా తీసుకున్నారని అర్థం అవుతుంది. అందువల్ల ఎక్కువగా తొలగింపులు చేయలేదు. అక్కడక్కడా వాక్యాలను మాత్రం తొలగించారు. ఆనాటి భాషను గురించి, దేశానికంతా ఒకటే భాష ఉండవలసిన ఆవశ్యకతను గురించి వివరిస్తూ ప్రేమ్‌చంద్ **Lingua Franca** వంటి భాష భారతదేశానికి అవసరం అని చెప్పారు. **దేశంలో Lingua Franca**కు ఉర్దూను ఉదాహరణగా చెప్పారు. ఇదే సమయంలో ఇంగ్లీషు భాష స్థానిక భాషలను నాశనం చేస్తున్నదన్న విషయాన్ని చెప్పారు. సేవాశ్రమము నవల అనువాదకులు మాత్రమే భాషకు సంబంధించిన పై అంశాలను అనువదించారు.

**4. ముగింపు:**

"సేవాసదన్" నవలకు తెలుగులో మూడు అనువాదాలు ఉన్నా, ప్రస్తుతం ప్రచురణలో ఉన్న అనువాదం పోలు శేషగిరిరావుది. దామెర్ల భ్రమరాంబ, కొండ విజయలక్ష్మీబాయి చేసిన అనువాదం (సేవాశ్రమము) మిగిలిన రెండు అనువాదాల కంటే సమగ్రంగా కనిపిస్తుంది. “సేవాశ్రమము” అనువాదంలో తొలగింపులు తక్కువగా ఉన్నాయి. మూలంలో సమాజం, సాహిత్యం, భాష వంటి అంశాలపై రచయిత అభిప్రాయాలను వీరి అనువాదం ఎక్కువగా చిత్రించింది.

“సేవాశ్రమము” శైలి గ్రాంథికంగా కనిపిస్తున్నా, తరువాత వచ్చిన సొమయాజులు అనువాదంతో పోలిస్తే “సేవాశ్రమము” నవలలోని శైలి సరళంగా ఉంది. శైలి విషయంలో శేషగిరిరావు అనువాదమే కొంత ఆధునికంగా కనిపిస్తుంది. మూడు అనువాదనవలల్లోనూ గ్రాంథికరూపాలు, లిప్యంతరీకరణలు, పదానువాదాలు కనిపిస్తున్నాయి. లక్ష్యభాష పాఠకుడు నవలను చదివేలా చేయాలంటే అనువాద నవల శైలి, లక్ష్యభాషలో సమకాలీనంగా ఉన్న సాహిత్య శైలిని అనుసరించాలి. ఇందుకోసం అనువాదకుడు లక్ష్యభాషలో సమకాలీనంగా వస్తున్న వచన సాహిత్యంలోని భాషను, ప్రసార, ప్రచార మాధ్యమాలు వాడుతున్న భాషను

పరిశీలించాలి. లక్ష్యభాషా పాఠకుడికి మూలం అందించే అనుభూతి అందుతున్నదా? అన్న విషయంలో కూడా దామెర్ల భ్రమరాంబ, కొండ విజయలక్ష్మీబాయిల అనువాదమే ముందుంటుంది.

జాతీయాలు, సామెతల అనువాదంలో భావానువాదం లేదా తొలగింపు అన్న పద్ధతులే ఎక్కువగా కనిపించాయి. మూలభాష (హింది)లో జాతీయానికి, లక్ష్యభాష(తెలుగు)లో సమానార్థక జాతీయం ఉన్నప్పటికీ అనువాదకులు, సమానార్థక తెలుగు రూపాలను వాడలేదు. దీనికి కారణం సమానార్థక తెలుగు జాతీయాలు, సామెతలను వెతకడానికి ఎక్కువ సమయం పట్టడం కావచ్చు. అందువల్ల జాతీయాలు, సామెతలకు సంబంధించి (సారూప్య) సమానార్థక జాతీయాలు, సామెతలను అందించగల ద్విభాషా నిఘంటువులను ఏర్పరుచుకోవాలి. తద్వారా భావానువాదం, తొలగింపు వంటి పద్ధతులను కొంతమేర తగ్గించవచ్చు. అలాగే అనువాద రచనకు లక్ష్యభాష దేశీయతను జోడిస్తూనే, మూలరచయిత శైలికి చెందిన స్పృహను కలిగించవచ్చు. ప్రస్తుత పత్రం ద్విభాషా నిఘంటువుల అవసరాన్ని సూచిస్తున్నది. మాండలిక అనువాదంపై కూడా తెలుగు అనువాదకులు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

### 5. పాదసూచికలు:

1. हिन्दी और तेलुगु कहावतों का तुलनात्मक अध्ययन, दक्षिणामूर्ति, एन. एस. पत्र : 297
2. సాంఘిక నవల – కథన శిల్పం, మృణాళిని, సి. పుట: 42.
3. సేవాసదన్, ప్రేమ్‌చంద్, శేషగిరిరావు, పోలు(అనువాదకుడు). పుట: 207.
4. सेवासदन, प्रेमचंद. पत्र : 05.
5. సేవాసదన్, ప్రేమ్‌చంద్, శేషగిరిరావు, పోలు(అనువాదకుడు). పుట: 05.
6. सेवासदन, प्रेमचंद. पत्र : 52.
7. సేవాసదన్, ప్రేమ్‌చంద్, శేషగిరిరావు, పోలు(అనువాదకుడు). పుట: 41.
8. సేవాసదన్, ప్రేమ్‌చంద్, శేషగిరిరావు, పోలు(అనువాదకుడు). పుట: 94.
9. సేవాసదన్, ప్రేమ్‌చంద్, శేషగిరిరావు, పోలు(అనువాదకుడు). పుట: 94.
10. సేవాసదన్, ప్రేమ్‌చంద్, శేషగిరిరావు, పోలు(అనువాదకుడు). పుట: 170 – 171.
11. సేవాసదన్, ప్రేమ్‌చంద్, శేషగిరిరావు, పోలు(అనువాదకుడు). పుట: 270.
12. सेवासदन, प्रेमचंद. पत्र : 05.
13. సేవాసదనము, ప్రేమ్‌చంద్, సోమయాజులు, యస్. యస్.వి.(అనువాకుడు). పుట: 15.
14. सेवासदन, प्रेमचंद. पत्र : 52.
15. సేవాసదనము, ప్రేమ్‌చంద్, సోమయాజులు, యస్. యస్.వి.(అనువాకుడు). పుట: 58.
16. सेवासदन, प्रेमचंद. पत्र : 05.
17. సేవాశ్రమము, ప్రేమ్‌చంద్, దామెర్ల భ్రమరాంబ, కొండ విజయలక్ష్మీబాయి (అనువాదకులు). పుట:10.
18. सेवासदन, प्रेमचंद. पत्र : 52.
19. సేవాశ్రమము, ప్రేమ్‌చంద్, దామెర్ల భ్రమరాంబ, కొండ విజయలక్ష్మీబాయి (అనువాదకులు). పుట:70.

20. Dialect in Translation. Leszek Berezowski. Page: 42.
21. సేవాశ్రమము, ప్రేమ్‌చంద్, దామెర్ల భ్రమరాంబ, కొండ విజయలక్ష్మీబాయి (అనువాదకులు). పుట:152.

## ౬. ఉపయుక్తగ్రంథసూచి:


1. ఆనందరామం, సి. 1990. తులనాత్మకసాహిత్యం–నవలాప్రక్రియ (వ్యవస్థాగతదృక్పథం). హైదరాబాదు: సి. ఉమ.
2. కుటుంబరాయ శర్మ, బొడ్డుపాటి. 1971. ఆంధ్ర నవలా పరిణామము. హైదరాబాదు: గాయత్రీ ప్రచురణము.
3. ప్రేమ్‌చంద్, దామెర్ల భ్రమరాంబ, కొండ విజయలక్ష్మీబాయి (అనువాదకులు). 1949. సేవాశ్రమము. రాజమండ్రి: అద్దేపల్లి&కో ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్.
4. ప్రేమ్‌చంద్, శేషగిరిరావు, పోలు. (అనువాదకుడు). 1988. సేవాసదన్. విజయవాడ: జయంతి పబ్లికేషన్స్.
5. ప్రేమ్‌చంద్, సోమయాజులు, యస్. యస్.వి.(అనువాకుడు). 1981. సేవాసదనము. విజయవాడ: ప్రేమ్‌చంద్ పబ్లికేషన్స్.
6. మృణాళిని, సి. 1988. సాంఘిక నవల - కథన శిల్పం. హైదరాబాదు: తెలుగు పరిశోధన ప్రచురణలు.
7. Andre Lefevere. 1992. Translating Literature: Practice and Theory in a Comparative Literature Context. New York: The Modern Language Association of America.
8. Leszek Berezowski. 1997. Dialect in Translation. Wroclawskiego: Wydawnictoo University
9. दक्षिणामूर्ती, एन. एस. 1966. हिन्दी और तेलुगु कहावतों का तुलनात्मक अध्ययन. मैसूर: लेकख का प्रकाशन.
10. प्रेमचंद. 1961. सेवासदन. इलाहाबाद: हंस प्रचुरण.


***

**గమనిక:** ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.

వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.